# మీ వెంట మేమున్నాం..

**దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్య**

- స్థానికుల్లో ఆత్మ స్థైర్యం పెంచేందుకు ఫ్లాగ్ మార్చ్
- ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి కృషి
- రౌడీషీటర్లపై నిరంతర నిఘా..



**చార్మినార్:** పాతబస్తీ దక్షిణ మండలం పరిధిలోని శాసన సభ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం, పోలింగ్, కౌంటింగ్‌లు ప్రశాంతంగా నిర్వహించడానికి దక్షిణ మండలం డీసీపీ పోతురాజు సాయి చైతన్య ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల నియమావళికి లోబడి పని చేస్తూ నియమావళికి వ్యతిరేకంగా వ్యవహరించే వారి పట్ల కఠినంగా వ్యవహరించున్నామని డీసీపీ అంటున్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ జరిగేటట్లు ఎన్నికల సిబ్బందితో పాటు పోలీసులు కృషి చేస్తున్నార న్నారు. మీ వెంట మేమున్నాం.. అంటూ ఓటర్లలో మానసిక స్థైర్యం కల్పించడానికి కీలకమైన అన్ని ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. రౌడీ షీటర్లపై రౌండ్ ది క్లాక్ నిఘా కొనసాగుతుందంటున్న పోతురాజు సాయి చైతన్యతో 'సాక్షి'జరిపిన ఇంటర్వ్యూ వివరాలు ఇలా ఉన్నాయి..

◆ **దక్షిణ మండలం జోన్ పరిధిలోకి ఎన్ని శాసన సభ నియోజకవర్గాల ఏరియాలు వస్తాయి?**

చార్మినార్, బహదూర్‌పురా, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురా, మలక్‌పేట్, రాజేంద్రనగర్ తదితర 5 నియోజకవర్గాల ఏరియాలు వస్తాయి.

◆ **జోన్ పరిధిలో ఎంత మంది రౌడీ షీటర్లున్నారు?**

376 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.

◆ **వీరందరి దిన చర్యలపై నిఘా ఉంటుందా?**

రౌండ్ ది క్లాక్ నిఘా ఉంటుంది. ఇప్పటికే రౌడీషీటర్లందరిని మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేశాం.

◆ **రౌడీషీటర్లకు ప్రత్యేకమైన కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారా..?**

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల జరగడానికి తీసుకోవాల్సిన అన్ని చర్యలను తీసుకుంటున్నాం. ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ఎస్‌హెచ్‌ఓలు సంబంధిత రౌడీషీటర్లకు సలహాలు, సూచనలు, వార్నింగ్‌లు ఇస్తున్నారు.

◆ **కొంత మంది రౌడీషీటర్లు రాజకీయ పార్టీల నాయకులతో దగ్గర సంబంధాలు కలిగి ఉన్నారు.. వీరికి ఎలాంటి కౌన్సెలింగ్ ఇస్తున్నారు?**

రాజకీయ పార్టీల నాయకులతో సంబంధాలున్నా.. శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా ఉండాలి.

◆ **ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చా?**

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా.. ప్రత్యర్థులను బెదిరించడం గానీ, ప్రశాంతంగా ఉన్న ఓటర్లను బెదరగొట్టడం లాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తాం.

◆ **ఎన్ని పోలింగ్ స్టేషన్లున్నాయి?**

387 లోకేషన్లలో 679 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఇందులో 295 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లున్నాయి.

◆ **రాజకీయ పార్టీల నాయకులకు మీరిచ్చే సలహాలు, సూచనలు.**

ఓటర్లను ప్రభావితం చేయడానికి విలువైన వస్తువులను బహుమతులుగా ఇవ్వరాదు. అంతేకాకుండా ఇతరత్రా వాటికి ప్రలోభ పెట్ట వద్దు. డబ్బులు పంచిపెట్ట వద్దు.

**ప్రశ్న: ఎన్నికల నియమావళి ఉల్లంగించే వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సభలు, సమావేశాలు నిర్వహించడానికి ముందస్తు అనుమతి తప్పని సరిగా ఉండాలి. రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల చట్ల ప్రకారం కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

## క్లుప్తంగా...

### బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



మంత్రి కేటీఆర్‌కు కార్యకర్తలను పరిచయం చేయిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

**జియాగూడ:** సీఎం కేసీఆర్ నిరుపేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల మైనార్టీ సోదరులు ఎంతో మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని కార్వాన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. సోమవారం జలవిహార్‌లో చేపట్టిన కార్యక్రమానికి కార్వాన్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున మైనార్టీ సోదరులతో కలిసి సమావేశానికి తరలివెళ్లి మంత్రి కేటీఆర్ సమక్షంలో మైనార్టీ సోదరులను బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు కిశోర్‌కుమార్, జియాగూడ డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, గ్రేటర్ నాయకులు శ్రీనివాస్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు జడల తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులను ప్రోత్సహించాలి



స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న శంకర్‌యాదవ్

**అఫ్జల్‌గంజ్:** క్రీడాకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలని జీహెచ్ఎంసీ పక్షనేత, తెలంగాణ రాష్ట్ర సైకై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంటి శంకర్‌యాదవ్ అన్నారు. వచ్చే నెల గోవాలో జరగనున్న 37వ జాతీయ స్థాయి పోటీలకు నగరానికి చెందిన నలుగురు యువకులు, నలుగురు యువతులు ఎంపికయ్యారు. ఈ యువ క్రీడాకారులకు ఆయన సోమవారం గౌలిగూడలోని తన నివాసంలో ట్రైనర్స్ సమక్షంలో స్పోర్ట్స్ కిట్లు, ట్రాక్‌సూట్స్ అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు మహేశ్‌యాదవ్, యశ్వంత్, శివయ్య, ఆనంద్, రజిని, ఝన్సి, వర్షారెడ్డి, జున్నైనా, ఆంజనేయులు, ట్రైనర్స్ గోవింద్ రాజ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

### టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ



అల్పాహారాన్ని పంపిణీ చేస్తున్న ఎస్ఎం.ముజీబ్ హుస్సేని, కేఆర్.రాజ్‌కుమార్

**అబిడ్స్:** టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా, అసద్ అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో మెహిదీ నవబ్‌జంగ్ కేన్సర్ ఆస్పత్రిలో దాదాపు 500 మందికి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎం ముజీబ్ హుస్సేన్ మాట్లాడుతూ.. తన తల్లిదండ్రుల ఆశీర్వాదంతో తన కుటుంబ సభ్యుల సహకారంతో జీవితాంతం సేవా కార్యక్రమాలు చేపడుతానన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సంఘం నాయకులు పర్వతాలు, జిల్లా సహ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, సభ్యులు కుర్రాడి శ్రీనివాస్ మహ్మద్ అబ్దుల్ ముజీబ్, ఖాలీద్ అహ్మద్, బి.శంకర్, వైదిక్ శాస్త్రి, ఆస్పత్రి కార్యదర్శి బి.శివకుమార్, ముస్తఫా, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

### అరుణ్ డేనియల్ ఎల్లమటికి గ్లోబల్ సిటిజన్ అవార్డు



మాట్లాడుతున్న అరుణ్ డేనియల్ ఎల్లమటి

**అబిడ్స్:** హైదరాబాద్ ఎన్జీఓ యంగిస్తాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అరుణ్ డేనియల్ ఎల్లమటి మెరిడియన్ గ్లోబల్ సిటిజన్ అవార్డును అందుకున్నారు. దేశంలోనే అతిపెద్ద స్వచ్ఛంద సంస్థ అయిన హైదరాబాద్ ఎన్జీఓస్ యంగిస్తాన్ ఫౌండేషన్‌కు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అరుణ్ డేనియల్ మాట్లాడుతూ.. వాషింగ్టన్‌లో జరిగిన గ్లోబల్ లీడర్‌షిప్ సమావేశంలో ప్రసంగించినట్లు చెప్పారు. ప్రపంచ వేదికపై తాను పాల్గొని యువకుల ఉత్సాహంపై సమాజంలో యువకుల ప్రోత్సాహంపై పెద్ద ఎత్తున ప్రసంగం చేశారన్నారు. యువత సాధికారత గురించి కూడా తాను ప్రసంగించినందుకు ఈ అవార్డు లభించిందన్నారు.

### నేడు డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్

**సంతోష్‌నగర్:** ఈ నెల 31న సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు హయత్‌నగర్ డివిజన్ పరిధిలో డయల్ యువర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఓ) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ తెలిపారు. బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, ఇబ్రహీంపట్నం, మిధాని, మహేశ్వరం డిపోల ప్రయాణికులు పాల్గొని తమ విలువైన సూచనలు, సలహాలు, సమస్యలను వివరించారు. ప్రయాణికులు 99592 26136 లో సంప్రదించి సూచనలు, సలహాలు, ఫిర్యాదులు చేయవచ్చునన్నారు.

## 'తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే'



ర్యాలీని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

**గోల్కొండ:** తెలంగాణలో మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. సోమవారం కార్వాన్ నుంచి ఆయన ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయన్నారు. మంత్రి కేటీఆర్ తెలంగాణకు విదేశీ పెట్టు బడులు తెచ్చి పరిశ్రమలు స్థాపించేలా చేస్తున్నారని దీన్ని వల్ల వేలాది మందికి ఉపాధి లభిస్తుందని ఆయన అన్నారు. విద్యా, వైద్య రంగంలో కూడా తెలంగాణనే నెంబర్ వన్ అని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ మాత్రం తెలంగాణకు చేసిందేమి లేదని అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చి ప్రజలను మరోసారి మోసగించడానికి సిద్ధమైందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, తూంకుంట అరుణ్‌కుమార్, శివరాత్రి రాములు, ఆజామ్‌ఖాన్, ఇమ్రాన్ అలీ ఖాన్ తదితరులున్నారు.

## స్వచ్ఛమైన పాలన బీజేపీకే సాధ్యం



అమర్‌సింగ్‌ను సన్మానిస్తున్న సూర్యవంశీ తదితరులు

**గోల్కొండ:** స్వచ్ఛమైన పాలన అందించడం ఒక్క బీజేపీకే సాధ్యమని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయనను నానల్‌నగర్ డివిజన్ బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ అగ్రపథంలో ఉందని చెప్పుకుంటున్న సీఎం కేసీఆర్ తన కుటుంబంపై వస్తున్న అవినీతి ఆరోపణల విషయాలపై పెదవి విప్పడం లేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు గుండాలుగా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ఎన్నో ప్రాజెక్టులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని పూర్తయిన వాటిలో సాంకేతిక లోపాలు ఉన్నాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బాలాజీ సూర్యవంశీ తదితరులున్నారు.

## గాజాపై సైనిక దాడులు అమానుషం



ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా గోల్కొండలో ఈఎఫ్‌సీఓ ఆధ్వర్యంలో నిరసన

**గోల్కొండ:** గాజాలో నివసిస్తున్న పాలస్తీనులపై ఇజ్రాయిల్ వైమయానిక బూతల దాడులు చేయడం అమానుషం అని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. సోమవారం గోల్కొండ రిసాల బజార్‌లో గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఖండిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ దాడులు ఆపాలి, ఇజ్రాయిల్ ఉత్పత్తులను కొనవద్దు అని పోస్టర్లు పట్టుకొని నినాదాలు ఇచ్చారు. అనంతరం మహ్మద్ నజీబ్ మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ఒక్క దేశం స్వాతంత్రం కోరుకుంటుందని, అయితే ఇజ్రాయిల్ మాత్రం పాలస్తీన గాజా పర్వత శ్రేణులపై ఉన్న పాలస్తీన ప్రజల స్వాతంత్రాన్ని వ్యతిరేకిస్తుందని ఆరోపించారు. ముస్లిం ప్రజలతో ఇజ్రాయిల్ కక్షకట్టినట్లు వ్యవహరించడం సరికాదని ఆయన అన్నారు. ప్రపంచ అగ్రదేశాలతో పాటు ప్రధాని మోదీ కూడా ఇజ్రాయిల్ అరాచకాలను అడ్డుకట్ట వేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహ్మద్ రాహుఫ్, అసద్, మౌలానా, సయ్యద్ ఖాజా తదితరులున్నారు.

## 'కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం'



ప్రచారం చేస్తున్న యాకుత్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రవిరాజు

**గౌలిపురా:** ఈసారి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని యాకుత్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.రవిరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం యాకుత్‌పురా నియోజకవర్గం గౌలిపురా డివిజన్‌లోని అంబికానగర్ తదితర ప్రాంతాల్లో ఆయన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కోట్ల శ్రీనివాస్, మామిడి కృష్ణ, డల్లు శివ, ఎం.శ్రీనివాస్, కోట్ల లడ్డూ పటేల్, పవన్‌కల్యాణ్ యాదవ్ పాల్గొన్నారు.

## చాంద్రాయణగుట్టలో బీజేపీకి అవకాశం కల్పించాలి



ఉప్పుగూడలో ప్రచారం చేస్తున్న చాంద్రాయణగుట్ట బీజేపీ అభ్యర్థి ఊరడి సత్యనారాయణ

**చాంద్రాయణగుట్ట:** నియోజకవర్గం అభివృద్ధికి తనకు ఒక్కసారి అవకాశం కల్పించాలని బీజేపీ చాంద్రాయణగుట్ట నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఊరడి సత్యనారాయణ ముదిరాజ్ అన్నారు. ఉప్పుగూడ, లలితాబాగ్ డివిజన్లలో సోమవారం ఆయన ఇంటింటికీ తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విన్నవించుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అనేక బస్తీలు ఇప్పటికీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చాంద్రాయణగుట్ట అసెంబ్లీ కన్వీనర్ గ్యార ప్రభాకర్, ఉపాధ్యక్షుడు జాలిగం చిరంజీవి, నాయకులు బర్ల శ్రీనివాస్, డాక్టర్ బి.పండరీ, ఎడ్ల పండరీనాథ్, పొన్న శ్రీనివాసారావు, వై.విజయ్‌కుమార్, మహేందర్ రెడ్డి, వెంకటేష్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వినోద్ కుమార్ సింగ్, శ్రీనివాస్‌రావు తదితరులు

**సంతోష్‌నగర్:** సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (క్రీడా)లో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించే ఈ వారోత్సవాలను కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ వినోద్ కుమార్ సింగ్, విజిలెన్స్ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రావు సమక్షంలో ప్రారంభించి అనంతరం ఉద్యోగులందరితో కలిసి సమగ్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉద్యోగులకు అవినీతి, అనైతిక చర్యల నిర్మూలన, విజిలెన్స్ సంబంధిత విషయాలపై విస్తృత అవగాహన కల్పించడానికి ప్రివెంటివ్ విజిలెన్స్ అండ్ విజిలెన్స్ మేనేజ్‌మెంట్ ఎథిక్స్ అండ్ గవర్నెన్స్, సిస్టమ్స్ అండ్ ప్రొసిజర్స్ ఆఫ్ ఆర్గనైజేషన్, సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ అనే అంశాలపై పలువురు నిపుణులు ప్రసంగించనున్నారన్నారు. ఈ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను నవంబర్ 6వ తేదీ వరకు నిర్వహించనున్నామన్నారు.

## బీఎస్‌పీ చాంద్రాయణగుట్ట అభ్యర్థిగా మూల రాంచరణ్ దాస్



**చార్మినార్:** చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి బీఎస్‌పీ అభ్యర్థిగా మూల రాంచరణ్ దాస్‌ను బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రకటించారు. పార్టీ కార్యాలయంలో సోమవారం 39 మందితో కూడిన జాబితాను ఆయన విడుదల చేశారు. ఈ జాబితాలో చార్మినార్ నియోజకవర్గం బీఎస్‌పీ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు నిర్వహిస్తున్న రాంచరణ్ దాస్‌కు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి చోటుదక్కింది. ఆయన మాట్లాడుతూ.. ఈసారి జరిగే ఎన్నికల్లో చాంద్రాయణగుట్ట నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీకి ధీటుగా ఎన్నికల బరిలో ఉంటానన్నారు. తనపై నమ్మకంతో తనకు ఈ టికెట్ కేటాయించిన బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్‌తో పాటు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చాట్ల చిరంజీవికి ధన్యవాదాలు తెలిపారు.

## గజ్వేల్‌లో సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తా: సుభద్రరెడ్డి



మేనిఫెస్టోను విడుదల చేస్తున్న సుభద్రరెడ్డి తదితరులు

**సుల్తాన్‌బజార్:** తెలంగాణ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌పై గజ్వేల్‌లో పోటీ చేయనున్నట్లు సోషలిస్ట్ పార్టీ (ఇండియా) అధ్యక్షురాలు, తొలి, మలిదశ ఉద్యమకారిణి రచ్చ సుభద్రరెడ్డి ప్రకటించారు. సోమవారం హైదర్‌గూడలోని ఎస్ఎస్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ఆమె విడుదల చేసి తొలి జాబితాను ప్రకటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్న, సన్నకారు రైతులకు మాత్రమే రైతుబంధు సంవత్సరానికి రూ.20 వేలతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 61 నుంచి 58కి తగ్గించి నిరుద్యోగులకు అవకాశం కల్పిస్తామని ప్రధాన ఎజెండాతో సోషలిస్ట్ పార్టీ (ఇండియా) ముందుకు వస్తుందని వెల్లడించారు. ప్రకటించిన తొలి జాబితాలో 14 మంది ఆర్.సుభద్ర రెడ్డి (గజ్వేల్), బీవీ.రమేష్ బాబు (గోషామహల్), పి.లక్ష్మణ్ (రాజేంద్రనగర్), గోపాల్ పతంగేయ (అంబర్‌పేట), రాజా గౌడ్ (మలక్‌పేట), షహజాది (సనత్‌నగర్), ఆర్.ధర్మ నాయక్ (ఇబ్రహీంపట్నం), కె.లక్పతి నాయక్ ( దేవరకొండ), ఎం.శ్రీనివాస్ (నాగర్జున సాగర్), ఎం.సైదయ్య(మిర్యాలగూడ)ల గెలుపు కోసం ప్రజలు కృషి చేయాలని కోరారు.

## ఎలక్ట్రిక్ వాహనాల భవిష్యత్తుపై అవగాహన



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ తదితరులు

**అబిడ్స్:** ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అబిడ్స్ మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించారు. సాంప్రదాయ వాహన స్థిరత్వం, ఎలక్ట్రిక్ వాహనాల భవిష్యత్తుపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఓయూ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ పలు అంశాలపై బోధించారు. ఐసీ ఇంజన్‌ల సంక్లిష్టత, ప్రత్యామ్నాయ ఇంధనాలు, హిమోబిలిటి కోసం ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ హైడ్రోజన్, బ్యాటరీ థర్మల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఆటోమెటిక్ రంగంలో ఫ్యూచర్ టెక్నాలజీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెథడిస్ట్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కె.కృష్ణారావు, డైరెక్టర్ లక్ష్మీపతిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభుజీ బెనకోప్, కన్వీనర్ డాక్టర్ ఎ.రాజశేఖర్, కో ఆర్డినేటర్ డాక్టర్ పి.రవిచందర్, డాక్టర్ ఎం.ఉదయ్‌కుమార్, అడ్మినిస్ట్రేటీవ్ ఆఫీసర్ సచ్చింద్రనాథ్ పాల్గొన్నారు.

## శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలి

**జియాగూడ:** దీపావళి మరుసటి రోజున పూర్వీకుల సమాదుల వద్ద పూజలు నిర్వహించుకోవడానికి శ్మశానవాటికల్లో సదుపాయాలు కల్పించాలని జియాగూడ మాజీ కార్పొరేటర్ మునేందర్ అన్నారు. సోమవారం జీహెచ్ఎంసీలో వినతి పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జియాగూడలోని గిరికపల్లి, కేశవస్వామినగర్ ఎస్సీ శ్మశానవాటిక, సాయిదుర్గానగర్, దుర్గానగర్, మూసీ పరిసర ప్రాంతాల్లో ఉన్న హిందూ శ్మశానవాటికల్లో జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శ్మశానవాటికల్లో ముళ్ల చెట్లను తొలగించడం, ప్రహరీలకు మరమ్మతులు, సమాదులకు సున్నాలు, విద్యుత్‌దీపాల ఏర్పాటు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాటు చేయనున్నారు. 10 ఏళ్ల నుంచి జోనల్ కమిషనర్‌లు శ్రద్ధ వహించడం వల్ల ఏర్పాట్లు జరుగుతున్నాయని గుర్తుచేశారు. ఈసారి కూడా 12, 13, 14వ తేదీల్లో పూర్వీకుల సమాదుల వద్ద ఆయా కుటుంబ సభ్యులు పూజలు చేస్తారని పేర్కొన్నారు.

## స్ట్రీట్ వెండర్స్‌కు మజ్లిస్ మద్దతు



టోలిచౌకిలో స్ట్రీట్ వెండర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** స్ట్రీట్ వెండర్స్ హక్కుల పరిరక్షణకు మజ్లిస్ ఒక్కటే పోరాటం చేసి విజయం సాధించిందని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆల్ఫా ఫంక్షన్‌హాల్‌లో స్ట్రీట్ వెండర్స్‌తో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వాతంత్రం రాకముందు నుంచి కూడా మజ్లిస్ పార్టీ స్ట్రీట్ వెండర్స్‌కు అండగా నిలిచిందన్నారు. అప్పట్లో రిక్షా కార్మికులకు మజ్లిస్ అండగా ఉండి వారి హక్కుల కోసం పోలీసులు, బల్దియా వారితో పోరాటం చేసిందని గుర్తుచేశారు. స్ట్రీట్ వెండర్స్‌కు బల్దియా తరపు నుంచి గుర్తింపు కార్డులు ఇప్పించింది కూడా తామేనని ఆయన అన్నారు. అర్హులైన స్ట్రీట్ వెండర్స్‌కు వివిధ ప్రభుత్వ బ్యాంకులు, సొసైటీల ద్వారా రుణాలు ఇప్పించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు ఆరూన్‌ఫరాన్ తదితరులున్నారు.

## అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్‌ను గెలిపించాలి



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బోయ నరేష్

**చాంద్రాయణగుట్ట:** అన్ని వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ అభ్యర్థి బోయ నరేష్ అన్నారు. జంగమ్మెట్ డివిజన్‌లోని ఛత్రినాక, హమాంబౌలి, శివగంగానగర్‌లో సోమవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అధోగతి చేసిందన్నారు. ఏళ్ల తరబడిగా మజ్లిస్ పార్టీ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, రాము, రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'గోషామహల్‌లో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుంది'



ప్రచారం చేస్తున్న పాండు యాదవ్, ముక్క కృష్ణాగుప్తా, గొడుగు శ్రీనివాస్ యాదవ్

**అబిడ్స్:** గోషామహల్‌లో బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి విజయం సాధించి హ్యాట్రిక్ సాధిస్తాడని గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌ను గెలిపించాలని గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా, సీనియర్ బీజేపీ నాయకులు గొడుగు శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాండుయాదవ్ మాట్లాడుతూ..భారీ మెజార్టీతో రాజాసింగ్ గెలుస్తారని పేర్కొన్నారు. ప్రధానీ నరేంద్రమోదీ పథకాలు, బీజేపీ విజయానికి సోపానలవుతాయన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్

**సంతోష్‌నగర్:** వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ నాయక్ అన్నారు. సోమవారం ఆయన ఎస్సైలతో కలిసి సంతోష్‌నగర్ ప్రధాన రహదారుల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ పార్కింగ్, లైసెన్స్, హెల్మెంట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు ఛలాన్లు విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకూడదని.. రోడ్లపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు సత్యనారాయణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

## యువతి అదృశ్యం



సబా బేగం (ఫైల్)

**గౌలిపురా:** యువతి అదృశ్యమైన ఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా తలా మసీదు ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ కూతురు సబా బేగం (20) సమీనా ఆస్పత్రి సమీపంలోని కృతి టైలరింగ్ కేంద్రంలో శిక్షణ పొందుతుంది. ఈ నెల 28న మధ్యాహ్నం 2.30 గంటలకు సబా బేగం శిక్షణ నిమిత్తం వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. తన కూతురు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## స్విమ్మింగ్ పోటీల్లో సత్తాచాటిన అవినాష్ శర్మ



అవినాష్‌శర్మకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం

**అబిడ్స్:** 100 మీటర్ల ఫ్రీస్టైల్ స్విమ్మింగ్ పోటీలలో అవినాష్ శర్మ మొదటి బహుమతిని పొందారు. ఆరు మాస్టర్ తెలంగాణ స్టేట్ స్విమ్మింగ్ పోటీలలో అవినాష్ శర్మ సత్తాచాటారు. మొదటి బహుమతి పొందిన ఆయనకు సర్టిఫికెట్లు అందజేసి నిర్వాహకులు అభినందించారు.

## కార్పొరేట్‌కు దీటుగా గోల్కొండ ఏరియా ఆస్పత్రి



ఐసీయూ విభాగంలో రోగిని పరిశీలిస్తున్న వైద్యుడు

**గోల్కొండ:** గోల్కొండ ఏరియా ఆస్పత్రి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలందిస్తోంది. ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడ అందుతున్నాయి. ఆస్పత్రికి సొంత ఆక్సిజన్ తయారీ ప్లాంట్ ఉండడం దీన్ని ప్రత్యేకత. పది పడకలతో ఐసీయూ వార్డు కూడా ఈ ఆస్పత్రికి అదనపు ఆకర్షణగా ఉంది. ప్రతి నిత్యం వెయ్యి మంది ఔట్ పేషంట్లు వచ్చే ఈ ఆస్పత్రి ఎన్నో ప్రత్యేకతలను చాటుకుంది. ఆస్పత్రి ఇన్ పేషంట్ విభాగం ఎప్పుడు కూడా ఫుల్ ఆక్యూపెన్సీతో ఉంటోంది. ఆస్పత్రికి అన్ని విభాగాల వైద్యులు సర్జన్స్ కూడా ఉన్నారు. దంత విభాగం, ఈఎన్‌టీ, జర్మటాలజీ విభాగం కూడా ఈ ఆస్పత్రిలో ఉంది. వివిధ రకాల వైద్య సేవలు అందించే ఫిజిషియన్స్, సర్జన్స్, గైనకాలజీస్టులు రోగులకు అందుబాటులో ఉంటారు. ప్రత్యేకంగా ఆర్థోపెడిక్ విభాగం కూడా ఉంది. అత్యాధునిక పరికరాలతో ఎప్పుడు హైజినిక్‌గా ఉండే ఆపరేషన్ థియేటర్ ఈ ఆస్పత్రికే తలమానికంగా ఉంది. మరోవైపు ఆస్పత్రిలో పచ్చని మొక్కలు ఎటు చూసిన కానవస్తుంటాయి. వివిధ రకాల పూలమొక్కలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఔషధ గుణాల మొక్కలతో పాటు పచ్చని ఎత్తైన చెట్లు రోగులకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని ఇస్తున్నాయి. త్వరలోనే ఆస్పత్రిలో రోగుల కోసం కొత్త బ్లాక్‌ను నిర్మించడం జరుగుతుందని ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. నగరంలోని ఏరియా ఆస్పత్రుల్లో గోల్కొండ ఏరియా ఆస్పత్రి నెంబర్ వన్‌గా కొనసాగుతుంది.

### ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి..



ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ ఆస్పత్రి అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల కోసం మంత్రి హరీష్‌రావుతో కలిశారు. ఆయన చొరవతోనే ఆస్పత్రిలో అదనపు బ్లాక్ నిర్మాణానికి నిధులు మంజరయ్యాయి. అన్ని రకాల వైద్య సేవలతో పాటు అన్ని రకాల రోగనిరోధక పరీక్షలు ఇక్కడే నిర్వహిస్తున్నాం. – డాక్టర్ మజహర్ ఉల్లా